సమయానికే తాగునీటి సరఫరా

- మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ
- అధికారులను ఆదేశించిన జీవీఎంసీ ఏడీసీ విశ్వనాథన్
- 49వ వార్డులో పర్యటన



బర్మా కాలనీలో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్

మద్రిపాలెం: పారిశుధ్యాన్ని మెరుగుపరచి, సమయానికి స్థానికులకు తాగునీరు సరఫరా చేయాలని అయా అధికారులను జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. 49వ వార్డు బర్మా కాలనీ, పరిసర ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, నీటి సరఫరాలను స్వయంగా పరిశీలించారు. ప్రశాంతి పార్కులో అభివృద్ధి పనులను, జ్ఞానాపురం ఆర్ అండ్ డీ యార్డులోని చెత్త పూడికల యంత్రాలను పరిశీలించి పూడికలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు సిబ్బందికి సహకరించాలని కోరారు. పర్యటనలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ మత్స్యరాజు, వైద్యాధికారి సునీల్‌కుమార్, ఏసీపీ వెంకటరావు, టీపీవో విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు



ఆధార్ సేవా కేంద్రంలో ఐరిస్ నమోదు చేస్తున్న బీఎస్ఎన్ఎల్ సిబ్బంది సంధ్య

సీతంపేట: బుల్లయ్య కళాశాల రోడ్, స్పెన్సర్స్ మాల్ వెనుక గల బీఎస్ఎన్ఎల్ కస్టమర్ కేర్ సెంటర్‌లో ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎవరైనా ఆధార్ సేవలు పొందవచ్చు. బయోమెట్రిక్ అప్‌డేట్(వేలి ముద్రలు), డెమోగ్రాఫిక్ అప్‌డేట్-చిరునామా, పుట్టిన తేదీ, పేరు మార్పు, మొబైల్ నంబర్ లింక్ చేయడం వంటి సేవలు ప్రభుత్వం నిర్దేశించిన రూ.50 నుంచి రూ.100 నామమాత్రపు రుసుముతో పొందవచ్చు. ప్రతి రోజూ 20 నుంచి 30 మందికి ఆధార్ సేవలు పొందే వీలు కల్పించారు. అవసరమైన పత్రాలతో పని దినాల్లో సేవలు పొందవచ్చని సిబ్బంది తెలిపారు. వివరాలకు 85008 68994, 765999 0829 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

28న రామలింగేశ్వరుడి కల్యాణం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు శంకరమఠం రోడ్డులో కొలువైన రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో జి.వి.రమాభాయి తెలిపారు. 27వ తేదీ ఉదయం గణపతి పూజ, రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ, ధ్వజారోహణ, అంకురారోహణ జరుగుతాయన్నారు. 28న సాయంత్రం స్వామి వారి పల్లకీ ఊరేగింపు, అనంతరం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. 29న ఉదయం వసంతోత్సవం, సాయంత్రం పుష్పోత్సవం జరుగుతాయని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: జోన్-2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి ఎస్ఎస్-161 భాస్కర్ గార్డెన్స్‌లో ఎల్‌టీ కండక్టర్ మార్పిడి నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. భాస్కర్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పైడి కృష్ణారావు హఠాన్మరణం



పైడి కృష్ణారావు మాస్టారు (ఫైల్)

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పైడి కృష్ణారావు మాస్టారు శనివారం ఉదయం హఠాన్మరణం చెందారు. హార్ట్‌స్ట్రోక్ రావడంతో ఆయన మరణించినట్టు వార్డు నాయకులు చెప్పారు. ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్ అయ్యాక, వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలు నచ్చి ఆయన పార్టీలో చేరారు. అప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద అభిమానంతో పార్టీలో వెన్నుదన్నుగా నిలిచారు. ప్రస్తుతం ఆయన పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు 50వ వార్డు మురళీనగర్ తెన్నేటినగర్‌లోని పైడి కృష్ణారావు స్వగృహం వద్దకు చేరుకుని సంతాపం తెలిపారు. ఆయన లేని లోటు తీర్చలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కృష్ణారావు మాస్టారు భౌతిక ఖాయానికి అంత్యక్రియలు నిర్వహిస్తామని వార్డులోని నాయకులు తెలిపారు.

హిందీ పరీక్షకు ఒక్కరే హాజరు



హిందీ పరీక్ష రాసి వస్తున్న విద్యార్థిని ఎర్నమ్మ

సీతమ్మధార: స్థానిక పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్‌లో శనివారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ హిందీ పరీక్షకు ఒక్క బాలిక మాత్రమే హాజరైంది. 9 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 8 మంది హాజరు కాలేదు. విజయనగరం జిల్లా, కొత్తవలస మండలం, కొమ్మపల్లి గ్రామానికి చెందిన ఎర్నమ్మ విశాఖలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ఎన్ఎంసీ హైస్కూల్‌లో చదువుకుంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో హిందీలో ఒక్క మార్కుతో ఫెయిల్ అయింది. సప్లిమెంటరీ పరీక్షకు కష్టపడి చదివి శనివారం కొత్తవలస నుంచి తల్లిదండ్రులతో కలిసి బైక్‌పై పరీక్షా కేంద్రానికి వచ్చింది. మిగిలిన 8 మంది హాజరు కాకపోవడంతో ఈ ఒక్క విద్యార్థిని మాత్రమే పరీక్ష రాసింది.

ఎర్నిమాంబ సన్నిధిలో అన్నసంతర్పణ



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుజాత



అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అన్నప్రసాదం

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అన్నప్రసాదాలు అమ్మవారికి నైవేద్యంగా అర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ముఖ్య అతిథి దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత ప్రారంభించారు. సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఎర్నిమాంబ అమ్మవారి మారువారం జాతర నిర్వహిస్తున్నట్లు ఈవో సురేష్ బాబా చెప్పారు.

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణలో భక్తులు, అర్చకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ



లలితా పీఠంలో విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు

సీతంపేట: వైశాఖ మాసం శనివారం సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ముందుగా స్వామి వారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, విశేష హారతులిచ్చారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు భూ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామికి విశేష పంచామృతాభిషేకం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



వెంకట సన్యాసిరావు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. వివరాలిలా.. గొల్లకంచరపాలెం రామాలయం వీధిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్న సర్వసిద్ధి వెంకట సన్యాసిరావు ఆటో నడుపుతూ, అప్పుడప్పుడూ కారు ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 16న ఆఫ్టింగ్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన అతడు ఇప్పటివరకు ఇంటికి చేరుకోలేదు. అతడి ఫోన్ రిపేరు రావడంతో ఇంట్లోనే వదిలి వెళ్లాడు. ఇన్ని రోజులైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల అంతటా వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో సన్యాసిరావు భార్య వెంకట నాగలక్ష్మి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ కేసు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి 5.6 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగుతో ఉంటాడు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు నీలం రంగు టీషర్ట్, సిమెంట్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, నేత్ర వైద్యుడు డాక్టర్ నరసింగరావు, సాధారణ వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఎం.అరవింద్ బీపీ, సుగర్, ఈసీజీ మొదలగు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పరీక్షా కేంద్రంలో తాగునీటి సదుపాయం

సాక్షి ఎఫెక్ట్..



సీతమ్మధార: స్థానిక పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్‌లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ పరీక్షా కేంద్రంలో శుక్రవారం పరీక్ష రాసిన విద్యార్థులు తాగునీరు లేక ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యపై శనివారం 'తాగునీరు లేక ఇబ్బందులు' అనే శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. జిల్లా విద్యాశాఖాధికారి స్పందించి ఎన్ఎంసీ హైస్కూల్‌ను సందర్శించి తాగునీరు ఏర్పాటు చేయించారు. తాగునీటి సమస్య తీరడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.